నిశ్శబ్దంగా ఉన్న ఆయన్ని అడిగింది సుభాషిణి తల్లి అనుమానంగా.

"ఎవరి దగ్గరనుంచి?"

"మీ అమ్మాయి, అల్లుడు బెంగుళూరు వెళ్ళారా?" అడిగాడు ఆయన.

"అవును. నాలుగు రోజులయింది. ఇప్పుడు టెలిగ్రాం ఇచ్చారా క్షేమంగా ఉన్నట్లు?"

చిన్నగా నవ్వింది సుభాషిణి తల్లి.

"బెంగుళూరు టూరిస్టు శాఖవాళ్ళు ఇచ్చారు టెలిగ్రాం. మీ అమ్మాయి, అల్లుడు ఇవ్వలేదు."

"ఏమిటి సంగతి?"

"అధైర్య పడకండి! ఇద్దరూ యివాళ ఉదయం గవర్నమెంట్ హాస్పిటల్‌లో పోయారు."

"ఎవరిద్దరూ?"

"మీ అమ్మాయి, అల్లుడు."

ఆ ముసలావిడకి ఆయన చెప్పే దేనిటో వెంటనే మనసులోకి ఎక్కలేదు. అలాగే తెల్లబోయి చూస్తూండిపోయింది.

"మీ అమ్మాయి, అల్లుడు ఎక్కి వెళుతున్న టాక్సీకి ఏక్సిడెంట్ అయింది....ఇద్దరూ చనిపోయారు. టూరిస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్ళ దగ్గర నుంచి తీసుకున్నారు వాళ్ళు ఆ టాక్సీ. కొబట్టి వాళ్ళు టెలిగ్రాం ఇచ్చి నట్టున్నారు."

సుభాషిణి తల్లి కళ్ళలోంచి నీళ్ళు కారుతున్నాయి. ఇప్పుడు ఆ ముసలాయన చెప్పిన మాటలు మనసులోకి ఎక్కుతున్నాయి.

"అధైర్య పడకండి!"

ఆవిడ బిగ్గరగా ఏడవడం గమనించి, ఆ ముసలాయన యింట్లో పని చేసుకుంటున్న భార్యకి వినపడేలా గట్టిగా అరిచాడు.

"ఒసేవ్! త్వరగా ఇలా రా!"

o o o

మర్నాడు మధ్యాహ్నం వరకు ఏడుస్తూనే వుంది సుభాషిణి తల్లి.

